హామీలు విస్మరించిన కూటమి నేతలు

- వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి
- మంగళగిరి 6,7 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు

మంగళగిరి టౌన్: కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. మంగళగిరి నగరపరిధిలోని 6,7 వార్డుల్లో బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మాట్లాడుతూ అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి కుట్రలను వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అందరూ సమష్టిగా కృషి చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రుణాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, సీనియర్ నాయకుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, జిల్లా నాయకురాలు మల్లవరపు సుధారాణి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఊట్ల పాలశ్రీనివాసరావు, నాయకులు కొసనం శ్రీనివాసరావు, నాగరాజు, మహేష్, దరిమి, సాయి, వెంకటేష్, విజయ్, సుధాకర్, దేవేందర్ రెడ్డి, బండారు సత్యనారాయణ, మాదాల గోపీకృష్ణ, జగన్నాధం కళ్యాణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే ఆప్కాస్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇప్పటం, వడ్డేశ్వరం పారిశుద్ధ్య గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గరిగ జ్యోతి, కార్యదర్శిగా కాకి బాబు, సహాయ కార్యదర్శిగా సరోజమ్మ, కోశాధికారిగా రమేష్‌లను, ఇప్పటం పారిశుద్ధ్య గ్రామ అధ్యక్షుడిగా సాంబశివరావు, కార్యదర్శిగా జి.పిచ్చయ్య, కమిటీ సభ్యులుగా కోటయ్య, అలివేలు, పోలయ్యలను ఎన్నుకున్నారు.

స్వచ్ఛత సేవలో భాగస్వాములవుదాం

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా



స్వచ్ఛత హీ సేవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంటీఎంసీ అధికారులు

మంగళగిరి టౌన్: పర్యావరణం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అందమైన, ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన నగరంగా మంగళగిరిని తయారు చేయడానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ 2025 కార్యక్రమాన్ని మంగళగిరిలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు, యువత భాగస్వామ్యంతో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని ఎయిమ్స్ బ్రిడ్జి వద్ద నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎర్రబాలెం సబ్‌స్టేషన్ రోడ్డులో నిల్వవున్నచెత్తను, పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు రత్నాల చెరువులోని వివిధ ప్రాంతాలను శుభ్రం చేశారు. కళావేదికలో హెల్త్ క్యాంప్ నిర్వహించిన 153 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించారు. కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ రోజుకొక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది, కేఎల్‌యూ, నిర్మల ఫార్మసీ, వీజీటీఎం డిగ్రీ కళాశాలల నుండి విద్యార్థులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని బస్టాండు సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వి.హరిబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రోడ్లను శుభ్రం చేసారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కేక్‌ను కట్‌చేశారు. వెంకటరమణ, టి.కాశీవిశ్వనాధరెడ్డి, రావూరి.నారాయణ, శ్రీనివాసరావు, శాంతి, వెంకట కోటేశ్వరరావు, ఎం.లక్ష్మా రెడ్డిలు పాల్గొన్నారు.

'ఎన్ఆర్ఐ'లో ఎంబీఏ, ఎంసీఏ పీజీ తరగతులు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంజయ్

మేడికొండూరు: మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎంబీఏ, ఎంసీఏ పీజీ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల ఎంబీఏ ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ జి.ఆర్.రెహమాన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.సంజయ్ మాట్లాడారు. ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన విద్యార్థులకు విస్తృత అవకాశాలు ఉంటాయన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు కోడింగ్ స్కిల్స్ కూడా నేర్పుతామని, దానికి తగిన అడ్వాన్స్ కంప్యూటర్ ల్యాబ్స్ తమ కళాశాలలో ఉన్నాయన్నారు. కళాశాల ఏఓ బండారు సీతారామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీహరి రావు, కే.శ్రీదేవి, పి.రవికుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో సెయింట్ ఆన్స్ క్రీడాకారుల ప్రతిభ



ఫిరంగిపురం: ఈనెల 14న కర్నూలు జిల్లాలో 17వ రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఫిరంగిపురం సెయింట్‌ఆన్స్ తెలుగుమీడియం విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. ఈసందర్భంగా పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించి అభినందించారు. హెచ్ఎం సిస్టర్ వి.థెరేసమ్మ, పీఈటీలు థామస్‌రెడ్డి, నిర్మల, ఉపాధ్యాయులు ఇన్నారెడ్డి, పద్మావతిలు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మ ఆలయం వద్ద వంద కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఇంజినీర్ ఏడుకొండలు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈప్రాంతంలో లోవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసమస్యను తొలగించేందుకు నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసామని దీనిద్వారా సమస్య తీరుతుందని చెప్పారు. ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ గురునాథరావు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ దుర్గాప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగుల ఆరోగ్య భద్రతపై అవగాహన



నిడుముక్కలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న చలపతి ఫార్మసీ విద్యార్థులు

నిడుముక్కల(తాడికొండ): రోగుల ఆరోగ్య భద్రతకు నిబంధనలు కఠినంగా అమలు చేయాలని మోతడక చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు అన్నారు. ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మోతడక చలపతి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిడుముక్కల గ్రామంలో మెగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఔషధాల ప్రాముఖ్యత, వాటి వాడుక, మందుల గడువు తేదీ తెలుసుకోవడం పలు అంశాలపై గ్రామంలో కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ సర్పంచ్ మాదాసు రత్నకుమారి, విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నల్లాని రామారావు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో నిడుముక్కల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పద్మావతి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, పలువురు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతిలో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ బృందాల పర్యటన



సమీక్ష నిర్వహిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

తాడికొండ: అమరావతి నగర అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టు కింద అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను పరిశీలించేందుకు వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ బృందం సోమ, మంగళవారాలలో అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. అమరావతిలో నిర్మాణ పనులు చేపట్టిన ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల ప్రతినిధులు తమ క్యాంపు సైట్‌లలో అమలు చేస్తున్న పర్యావరణ, సామాజిక రక్షణ ఇతర కార్యకలాపాలను, కార్మికుల భద్రతకై అమలవుతున్న విధానాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తుళ్ళూరులోని హెచ్ఎస్ఆర్ కళ్యాణవేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో అమరావతిలో అమలవుతున్న పర్యావరణ, సామాజిక రక్షణ తీరు పట్ల ప్రపంచ బ్యాంకు ఏడీబీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టు మేనేజ్ మెంట్ ప్రతినిధులకు ఈ సందర్భంగా ప్రపంచ బ్యాంకు ఏషియన్ డెవెలప్‌మెంట్ బ్యాంక్ బృందం పలు సూచనలు చేసింది. రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రక్రియ, సిటిజన్ అడ్వైజరీ గ్రూప్ నుంచి వచ్చిన సలహాలను గురించి బృందానికి వివరించారు. రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యలను పరిష్కరించేందుకు అర్జీలు స్వీకరించి ఆయా అర్జీల పరిష్కారానికై సమగ్రంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం(జీఆర్ఎం) గురించి వివరించగా, బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం

రెండో విడత భూ సమీకరణను నిరసిస్తూ 80వ రోజుకు చేరిన జంజనం దీక్షలు



80వ రోజు రిలే నిరసన దీక్షలలో నినాదాలు చేస్తున్న జంజనం కోటేశ్వరరావు, రైతులు

తాడికొండ: రైతులకు అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రెండో విడత భూ సమీకరణ నిరసిస్తూ రాజధాని పరిసర ప్రాంత రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు నిడుముక్కల గ్రామంలో చేస్తున్న నిరాహార దీక్ష బుధవారానికి 80వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అభివృద్ధి పేరుతో రెండవ విడత భూ సమీకరణకు ప్రభుత్వం సిద్ధపడి లీకులిచ్చి ముఖం చాటేయడం వెనుక ఆంతర్యం ఏమిటో తెలియజేయాలన్నారు. చిన్నపాటి లీకులిచ్చి గ్రామ సభల పేరుతో జనంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి రైతులు ఎదురుతిరగడంతో నేటికీ భూ సమీకరణపై స్పష్టత ఇవ్వకుండా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

- కూటమి ప్రభుత్వం గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించి మోసం చేసిందని, ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలతో భూముల ధరలు అమాంతంగా పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించకుండా నిర్ణయాలను తరచూ మార్చుకోవడం కారణంగా నమ్మి భూములిచ్చిన రైతులు పరిసర ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటి వరకు ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుపై స్పష్టత లేదని, ఏం జరుగుతుందో కూడా తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఏ అడుగు వేయాలన్నా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని భూ సమీకరణకు వెళ్లాలని, ఒక వేళ తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం భూ సమీకరణకు వెళితే రైతుకు ఎకరాకు రూ.కోటి పరిహారం చెల్లించడంతో పాటు, 1250 గజాలు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

'స్వస్థ నారీ.. అభియాన్'ను సద్వినియోగం చేసుకోండి



నుదురుపాడులో పరీక్షలు చేస్తున్న వైద్యులు యానీగ్రేస్, సబీరాబేగం

తాడేపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నామని, తాడేపల్లి పీహెచ్‌సీలో సెప్టెంబర్ 19వ తేదీన ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేయనున్నామని ఈ శిబిరంలో వైద్యురాలు డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ అనూష తదితర వైద్యులు తమ సేవలను అందించనున్నారని, మహిళలకు గుండెజబ్బులు, మధుమేహం, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనత వంటి వ్యాధులను గుర్తించి చికిత్సలు అందజేయనున్నారని, ఈ అవకాశాన్ని మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈమనిలో...

దుగ్గిరాల: స్వస్థ్ నారి, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా అన్ని రకాల వైద్య సేవలు ఒకే చోట అందించటం జరుగుతుందని వైస్ ఎంపీపీ సాయి చైతన్య అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో, ఈమని ఆరోగ్యకేంద్రంలో స్వస్థ్ నారి, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైస్ ఎంపీపీ సాయి చైతన్య ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభించారు. కంటి పరీక్షలు, చిన్న పిల్లలకు టీకాలు, వైద్య అవగాహన, రక్తహీనత, క్షయ గుర్తింపు పరీక్షలు, బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి పరీక్షలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు రక్తదానం, అవయవదానం, మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్యులు ఎ.శ్రీవల్లి, సీహెచ్ఓ, డి.స్వరూపా రాణి, క్షత్రియ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: పోషకాహార లోపంతోనే అనారోగ్యం చేకూరుతుందని సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో శిశువుల ఆరోగ్యం వారి తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉంటుందన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు సమాజానికి అది ఎంతో శ్రేయస్కరంగా ఉంటుందని చెప్పారు. సూపర్ వైజర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, గ్రామపెద్దలు చింతా లక్ష్మీనారాయణ, పి.కోటిరెడ్డి, పుల్లారెడ్డి, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో బుధవారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. తక్కెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 168 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు వైద్యురాలు శ్వేత తెలిపారు. సర్పంచ్ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్ఎస్ షేక్ అబ్దుల్ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

- నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 153 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేసినట్లు వైద్యాధికారి యానీగ్రేస్ తెలిపారు. వైద్యులు సబీరాబేగం, సీహెచ్‌వో వెంకటలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ కె.సుదర్శన్‌రాజు, సర్పంచ్ నాగమల్లేశ్వరి, గ్రామపెద్దలు షేక్ మస్తాన్ వలి, జి.శివయ్య, బ్రహ్మారెడ్డి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో...

పెదవడ్లపూడి(మంగళగిరి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే బలమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ తెలిపారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీకే పార్థసారథితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ గర్భిణులు, యువతులు, వృద్ధ మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవగాహన కల్పించడం అభియాన్ ప్రధాన లక్ష్యమని వివరించారు. అదేవిధంగా రామచంద్రాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించి, పలు వైద్య సలహాలు ఇచ్చారు. మార్కెట్ యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చందు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

దుగ్గిరాల: తేమ వాతావరణం వల్ల వరి, పసుపు పైర్లలో సంభవించే తెగుళ్ల వ్యాప్తిని అరికట్టాలని దుగ్గిరాల మండల వ్యవసాయాధికారి ఆర్.విజయబాబు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం చిలువూరు, కంఠంరాజుకొండూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమవేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాతావరణంలో విపరీతమైన తేమ ఉండటం వల్ల వరి, పసుపు పంటల్లో చీడ పీడల, తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువ ఉందని వాటిని నివారణకు రైతులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

'అంగీకార్-2025' బ్రోచర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: నగరపాలకసంస్థ కార్యాలయంలో బుధవారం అంగీకార్ 2025 బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చడంలో భాగంగా పీఎంఏవై-యు 2.0 పై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ పథకాన్ని సెప్టెంబర్ 2024లో ప్రారంభించారని, పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుంచి రూ. 2.50 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని పొందవచ్చన్నారు. మంగళగిరి ఎయిమ్స్ ప్రధాన ద్వారం వద్ద నుంచి ఎంటీఎంసీ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు వడ్డేశ్వరం బాలిక ఎంపిక



విద్యార్థిని నవీన (ఫైల్)

తాడేపల్లిరూరల్: రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె. జోజప్ప బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సిహెచ్ నవీన మంగళవారం బాపట్ల జిల్లా ముత్తాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పోటీలలో పాల్గొని తన ప్రతిభను కనబరిచి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా నవీనను పాఠశాల ఉపాధ్యాయులు, పీడీలు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

బస్సులు కండీషన్‌లో ఉండే విధంగా చర్యలు

ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్

తెనాలిఅర్బన్: ఆర్టీసీ బస్సులన్ని కండీషన్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి డిపోను బుధవారం ఆయనతో పాటు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఆపరేషన్) ఏ అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) జంగల్ రెడ్డిలు తనిఖీ చేశారు. ముందుగా గ్యారేజ్‌లో మొక్కలు నాటారు. ఆవరణను పరిశీలించారు. బస్సుల పనితీరుపై ఆరా తీశారు. బస్సుల రిపేరులకు సంబంధించిన స్పేర్ పార్ట్సు ఏమైనా అవసరమైతే తమకు తెలియజేయాలని సూచించారు. జీరో బ్రేక్ డౌన్ ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకాన్ని అందరి సహకారంతో ఎటువంటి సమస్యలు లేకుండా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఫ్రీ బస్సులు ఏర్పాటు చేసిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని చెప్పారు. అనంతరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఇంధనం పొదుపు చేసిన సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ హెచ్చరించారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన నాయకులు సూర్యప్రకాష్, సాంబశివరావు, నాగేశ్వరరావు, సుభానీలతో కలసి ప్రారంభించి మాట్లాడారు. కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం సుమారు 30 సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలన్నారు. కార్మికులు దానయ్య, పిచ్చయ్య, నాగేశ్వరరావు, సువర్ణ కుమారి, కాసమ్మ, ఆశీర్వాదం, ఇమాంబీ, దుర్గాభవాని, సారమ్మ, నాగమల్లేశ్వరి, ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ విద్యార్థుల ఫీల్డ్ విజిట్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా బుధవారం ఫీల్డ్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీల్డ్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ఒకేషనల్ ట్రైనర్ అరవింద్ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలో కెఎల్ యూనివర్శిటీని విద్యార్థులు సందర్శించారని తెలిపారు. జ్ఞాన సముపార్జనకు, ప్రత్యక్ష అనుభవాలను తెలుసుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు.

కమ్యూనిటీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలి



దుగ్గిరాల: చిలువూరు గ్రామంలోని కమ్యూనిటీ హాల్ స్థలం ఆక్రమణలకు గురైందని వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఏపీ స్టేట్ ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరి నాగరాజు మాదిగ అన్నారు. బుధవారం దుగ్గిరాల మండలం చిలువూరులో నాగరాజు మాట్లాడుతూ గ్రామంలోని మాదిగపల్లెలో కమ్యూనిటీ హాల్ ఆక్రమణపై హైకోర్టు, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా ఆక్రమణలు తొలగించి, వెంటనే చర్యలు తీసుకోవాలని 2023 సంవత్సరంలో గుంటూరు జిల్లా కలెక్టరు అత్యవసర నోటీసులు జారీ చేయగా, తెనాలి సబ్ కలెక్టర్ తదుపరి చర్యల నిమిత్తం దుగ్గిరాల ఎంపీడీఓకు నోటీసులు జారీ చేశారన్నారు. అయితే రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఆక్రమణలు తొలగించకపోవడం విడ్డూరమన్నారు. ఈ సమస్యపై సమాచర హక్కు చట్టం కింద ప్రశ్నించగా.. దుగ్గిరాల డిప్యూటీ ఎంపీడీఓ నెప్రహా, పంచాయతీ సెక్రటరీలు ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలించారని, త్వరలో ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి

మంగళగిరి టౌన్: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ అనూష, ఏసీడీపీఓ సౌమ్య అన్నారు. మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో బుధవారం పోషక అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లెప్రసీ ఆఫీసర్ జోసఫ్, మలేరియా అధికారి శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ డాక్టర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీదేవి, రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మేడికొండూరు: మేడికొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు మన్నవ స్వప్న అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధానంగా గత సమావేశంలో వచ్చిన సమస్యల పరిష్కారం పై ఏ మేరకు పూర్తి చేశారని అంశం మీద ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో గ్రామాలలో ప్రధానంగా ఎదురయ్యే తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖ అధికారుల బాధ్యతలను గుర్తు చేశారు. వైద్యాధికారి డాక్టర్ సిద్ధిక్, ఎంఈఓ అబ్దుల్ అలీమ్, ఏఓ లక్ష్మి, విద్యుత్‌శాఖ అధికారి పుల్లారెడ్డి, ఉపాధి ఏపీఓ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ అధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఎంపీడీఓ డేవిడ్ ప్రభాకర, తహసీల్దార్ ఎం.రఘు, మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.